# పశువూ! మనిషి!

రంగయ్యగారి ఎల్లావు తొలిచూలు నిండి కోడెదూడను పెట్టింది.

ఆ రోజు ఇల్లంతా పండగలా హడావిడిగా వుంది. రెండురోజులు ఎల్లావు ఇంటిదగ్గిరే వుంది.

మూడోరోజున చినజీతగాడు ఎల్లావును మిగతా గొడ్లతోపాటు బీట్లో మేపుకొని రావటానికి వదిలాడు.

తొలి ఈత బిడ్డమీద మమతతీరని ఎల్లావు దూడను వదిలి వెళ్ళ లేక, చావిట్లోకీ దొడ్లోకీ కదం తొక్కుతూ మారాం చేసింది.

కాని జీతగాడు తన్ను వదిలి వెళ్ళాడని తెలుసుకున్నాక అన్ని గొడ్లకంటే ముందుగా బీట్లోకి నడిచింది.

పొద్దు వాటారింది. గొడ్లకాడ బుడ్డోడు బీటుకు అల్లంతదూరాన ఉన్న నల్ల చెర్లోకి పశువుల్ని తోలి, చెరువుగట్టుమీద చింతచెట్టుకింద బాచీపెట్లు వేసుకొని అన్నంమూట విప్పుకున్నాడు. కొరివికారం పచ్చ డితో కలిపిన అన్నంముద్దల్ని గబగబా ఉసిళ్ళుతోలుతూ తినటంలో మునిగిపోయాడు జీతగాడు.

చెర్లోదిగి, నీళ్లుతాగి, చల్లని నీటిలో తుళ్ళుతూ పొర్లుతూ, జలకా లాడుతోన్న ఎల్లావుకు దూడ గుర్తొచ్చింది.

పొదుగు జివజివ లాడింది. అంతే! అక్కడలేచిన ఎల్లావు, చెరువుకట్ట దూకి,పుట్టదాటి, డొంక వదిలి మాగాటిచేలకు అడ్డం పడింది.

గుండెల్లో బిడ్డమీది మమకారం మసులుతోంటే, జివజివ లాడు తోన్న పొదుగులో పాలు కదులుతోంటే మెడ కింద గంగడోలు అల్ల ల్లాడుతోంటే, పట్టుకుచ్చులా తోక పైకెత్తి, మోరచాచి, ఉరకలువేస్తూ, నురగలు కక్కుతూ, చెంగు చెంగునా పరుగులు వేస్తూన్న ఎల్లా వుకు, ఈనకాచిన పిల్లిపెసర చేను తన గిట్టలకింద నలిగిపోతోందన్న సంగతి తెలియదు-బాణాకర్రతో ఎల్లమంద ఎదురునిల్చి నడిచేలో నిలేసే దాక !

గుండెలు పడిగిలిన పసిబిడ్డ తల్లి రివ్వున వెనక్కు మళ్ళింది. మళ్ళీ పరుగు లంకించుకొనే లోపున ఎల్లమంద చేతుల్లో వున్న పలుపు ఎల్లావు మెడకు చుట్టుకుపోయింది.

పల్లపుసాగు సన్నరైతు ఎల్లమందకు ఎగువసాగు మోతుబరి రైతురంగయ్య అంటే మహాకసి. చేనుతడిచే నీళ్ళు అందినా, కిందఉేడు ఆసామి రంగయ్య చప్పున నీళ్లు వదల్లేదని అగ్గిబుగ్గయిపోయాడు. రంగయ్యమీద కసి తీర్చుకొనే అదును దొరక్క మరీ మండిపో తున్నాడు లోలోపలే.

తన పంటచేనుకు అడ్డంపడి అల్లిబిల్లి తిరుగుతున్న రంగయ్య గారి ఎల్లావును చూసేసరికి యల్లమందకు అరికాలు మంట నెత్తికెక్కి నట్లయింది. యల్లమంద ఎల్లావును దొరకపుచ్చుకున్నాడు.

ఇంతకాలానికి చిక్కాడు రంగయ్య తనచేతిలో ! దొరికిన అదును పోగొట్టుకోకూడదు! ఆవును బందెలదొడ్లో పెట్టేస్తే సరి !

ఉన్నఊళ్ళో పాడి ఆవును బందెలదొడ్లో పెట్టిస్తే నలుగురూ చివాట్లు వేస్తారని భయపడ్డాడు యల్లమంద. ఆలోచించి కోసెడుదూరాన వున్న గోపాలపురం తోలుకెళ్ళి, ఎల్లావును బందెల దొడ్లో పెట్టించి హాయిగా గాలి పీల్చుకున్నాడు. ఏదో ఘనకార్యం చేసినవాడిలా ఛాతీ విరుచుకుంటూ, భుజాలు ఎగరేసుకుంటూ మీసాలు దువ్వుకుంటూ తిరిగి ఊళ్ళోకి వచ్చాడు. కొంచెందూరం అయినా చుట్టూతిరిగి రంగయ్య ఇంటి ముందునుంచి వెళ్ళాడు. రంగయ్య దొడ్లోనుంచి వస్తున్న "అంభా!" అనే లేగదూడ అరుపులు ఆనందాన్ని కలిగించాయ్.

ఎల్లమంద ఇంటికి చేరేసరికి ఊరు మాటుమణిగింది.

తడికతోసి, గడప దాటుతోన్న ఎల్లమందను చూడగానే, మూడు నెల్ల పసిగుడ్డును వళ్ళో పెట్టుకొని కునుకు తీస్తోన్న ముసల్ది బావురు మంది.

బిడ్డ మధ్యాహ్నంనుంచి మూసిన కన్ను తెరవలేదు. వళ్ళు తెలి యని జ్వరంలో మధ్య మధ్య ఉలిక్కిపడుతున్నాడు.

ఎల్లమంద భార్య ప్రసవించిన మూడోరోజున పసికందును ఎల్ల మంద చేతుల్లో పెట్టి కళ్లు మూసింది.

అప్పటినుంచీ నాయనమ్మ చేతుల్లో, ఎల్లమంద కనురెప్పలకింద ఆప్యాయంగా సాకబడుతోన్న బిడ్డకు అమాంతంగా జ్వరం ముంచు కొచ్చింది.

భుజాన కండువా అన్నా వేసుకోకుండా ఎల్లమంద అనంతా చార్యులవారి దగ్గరకు పరుగెత్తాడు.

అనంతమైన వ్యాధులకూ, ఆ పొట్లాలమందే ఇచ్చే అనంతా చార్యుల వారు బిడ్డనాడి పరీక్షించారు. నాడి చూస్తూ గంభీరంగా తల ఆడించారు. ఆత్రంగా ఎల్లమంద ఆచార్యులవారి ఆడుతున్న తలను చూస్తూ నిలబడ్డాడు.

గుడ్డసంచి విప్పి తెల్లపొడిని మూడు చిన్నపొట్లాలు కట్టి ఎల్ల మందకు అందించాడు.

"బిడ్డ పరిస్థితి గడ్డుగానే వుంది !"

ఆచారి మాటలకు ఎల్లమంద నిలువెల్లా వణికిపోయాడు.

"భయపడకు. ప్రతిమూడుగంటలకూ అరఔన్సు ఆవుపాలలో రంగరించిపోయండి. రాత్రికి గడిస్తే ప్రాణభయంలేదు. పొద్దున్నే వచ్చి ఎలావుందో చెప్పు !" అంటూ ఆచార్యులవారు వేగంగా నడిచి వెళ్ళిపోయారు.

ఎల్లమంద రెండు క్షణాలు కొయ్యబారిపోయి నిల్చుండిపోయాడు. తన బిడ్డకు ఈరాత్రి గడవాలా ? గడవక పోతే ? నిలువునా నీరయి పోయాడు ఎల్లమంద.

ఎల్లమంద బుడ్డిచెంబు తీసుకొని ఊరిమీదపడ్డాడు ఆవుపాలకోసం. ఆవులున్న ఆసాముల ఇళ్ళన్నీ తిరిగాడు పరుగులాంటి నడకతో. కాని ఏంలాభం? ఆవుపాడిగల శిరిగల ఇళ్ళల్లో పాలల్లో తోడేసి నిద్రలు పోతున్నారు. అక్కడకూ ఓ దయగల ఆసామి మళ్ళీ దూడను విడిచి చూశాడు. చేతిలోని చెంబు కుడితి తొట్లో పడేట్టు తన్నింది ఆవు.

ఎల్లమంద నిరాశతో ఇంటిముఖం పట్టాడు. మగతలో ఎగిరెగిరి పడుతోన్న పసివాడు కళ్ళల్లో కదిలాడు.

ఒక్కగా నొక్కబిడ్డ! ఎంతోకాలానికి కలిగిన బిడ్డ! తనకు కాకుండా పోతాడా! భార్యపోయిన దుఃఖాన్ని ఆబిడ్డను చూసుకొనేకదా మర్చిపోగలుగుతున్నాడు!

ఓ గుక్కెడు ఆవుపాలకోసం తనబిడ్డ తనకు కాకుండాపోతాడా! బిడ్డ ప్రాణాలను కాపాట్టానికి గుక్కెడు ఆవుపాలను సంపాదించలేని తను బ్రతికెందుకు?

తండ్రి హృదయం తల్లడిల్లి పోసాగింది.

ఈ రాత్రి ఎలాగడపటం? ఎవరైనా తనకు ఓ ఔన్సు ఆవు పాలిస్తే? వాళ్ళకు తన సర్వస్వం ఇస్తాడు! జీవితం అంతా ఊడిగం చెయ్యమన్నా చేస్తాడు! తనప్రాణాలు కావాలన్నా ఇస్తాడు!

హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలయే శబ్దాలూ, సముద్ర ఘోషలూ, రైళ్ల ఢీ కొనటంలాంటివి అయాక, ఎల్లమంద మెదడులో ఓ చిన్న ఊహ తళుక్కున మెరిసింది.

అంతే! రేచులా, గాలిలా, సుడిగాలిలా, తారాజువ్వలా, ఆ చీకట్లో చేల కడ్డంపడి, కంచెలుదాటి కంపలుదాటి పరుగులు తీస్తున్నాడు ఎల్లమంద.

గోపాలపురం బందెలదొడ్డి దగ్గరకొచ్చి ఆగాడు రొప్పుతూ. గేటుకు వేసి వున్న పెద్దతాళంకేసి జాలిగా చూశాడు.

నాలుగుగోడలమధ్యా అలజడిగా తిరుగుతోన్న ఎల్లావు కళ్ళ బడింది.

ఎల్లమందకు పోతున్న ప్రాణాలు తిరిగివచ్చినై. ఎల్లావు ఎల్లమంద కళ్ళకు ప్రాణదాతలా కన్పించింది.

చివాలున గోడదూకి దొడ్లోకి వచ్చాడు. బుసలుకొడుతున్న ఎల్లావు గిర్రున తిరిగి ఎల్లమంద రొమ్ములో కొమ్ములు పెట్టింది.

ఎల్లమంద తన రెండుచేతుల్నీ ఎత్తి ఎల్లావు గంగడోలును నిమురుతూ "గోమాతా! నా బిడ్డను కాపాడు!" అని మనసులో ప్రార్థించాడు.

చల్లగా, మెల్లగా, లాలనగా, పొదుగులోకి చెయ్యి పోనిచ్చాడు.

బిడ్డకోసం తహతహలాడిపోతున్న గోమాత వళ్లు పులకరించింది. పొదుగులోనుంచి పాల జల్లులు అమృత జల్లులై చిమ్మినై.

పాలభారంతో అలిసి, కదిలిపోతున్న ఎల్లావు క్షీరవర్షాన్నే కురిపించింది.

ఎల్లావు తన తలనూ, చెంపల్నూ, చేతుల్నూ, నాకుతోండగా, చెంబు నిండుగా పాలుపిండుకొన్నాడు ఎల్లమంద.

కృతజ్ఞతాభారంతో ఎల్లావును గోముగా నిమిరి పాలచెంబును తీసుకొని ఇంటివైపుకు పరుగుతీశాడు ఎల్లమంద.

ఆవుపాల అనుపానంతో బిడ్డకు రెండుసార్లు మందుపోశాడు. పసివాడి ముఖంలోకి చూస్తూ కూర్చున్న ఎల్లమందకు కళ్ళుతెరిచి బోసినవ్వుల్ని చిలకరించేబిడ్డ కన్పించాడు. ఎల్లమంద హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కింది.

కాని....

ఎల్లమంద చెవులకు, తనగుండెలు నల్లరాతిమీద పడి పగిలిన కుండ పెంకుల్లా విన్పించాయ్!

"అంబా! అంబా!" అల్లంతదూరాన లేగదూడ ఆర్తనాదం! అమ్మకోసం - పాలకోసం - ఆకలితో అలమటిస్తున్న లేగదూడ పిలుపులు— బాణాల్లా - శూలాల్లా ఎల్లమంద చెవులకు నాటాయ్!

ఉన్నపాటున లేచి ఎల్లమంద రంగయ్యగారి దొడ్లోకి వచ్చి వాలాడు. చావిట్లో కట్టుగొయ్యకు పలుపుచుట్టుకొని - అమ్మకోసం....

పాలకోసం అలమటిస్తోన్న లేగ దూడను అమాంతంగా భుజాలమీద వేసుకొన్నాడు ఎల్లమంద. భుజాలమీద దూడతో ప్రహరీగోడ దూకి బయట పడ్డాడు.

అర్ధరాత్రి ! భుజాల మీద బుల్లి బసవడు "అంభా ! అమ్మా !" అని అరుస్తోంటే ఎల్లమంద కాళ్ళల్లోకి వెయ్యి లేపాక్షి బసవదేవుళ్ళ బలం తెచ్చుకొని వేవేగంగా మాగాటిచేల కడ్డంపడి, పంట కాలవ దాటి, గనెందూకి, శ్రీరామచంద్రుడు విడిచిన బాణంలా వచ్చి గోపాల పురం బందెలదొడ్డిముందు వాలాడు.

గోడ దూకి లేగదూడను తల్లిముందు వదిలాడు. లేగదూడ ఆత్రంగా తల్లి పొదుగులో తలదూర్చింది. ఎల్లమంద సంతృప్తిగా చూశాడు.

ఎల్లావు ఆప్యాయంగా బిడ్డను గోముగా నాకుతూ పాలు కుడుపు తుంటూంటే ఎల్లమంద కళ్ళు చెమ్మగిల్లాయి. మనస్సు చిత్తడి నేల అయింది.

తెల్లవారిందాకా, గ్రామాధికారి ఇంటిముందు పడిగాపులు కాచి, ఎల్లమంద ఆవుకూ, దూడకూ చెల్లించవలసిన శుల్కం చెల్లించి, తల్లినీ బిడ్డనూ విడిపించాడు.

దారిలో తన చేనుదగ్గర ఆగి, ఓ మోపెడు పిల్లిపెసరమేత కట్టుకుని తలమీద పెట్టుకొన్నాడు.

ఎల్లావునూ, లేగదూడనూ రంగయ్యగారి దొడ్లోకి తోలుకొచ్చి గాట్లో పిల్లిపెసరమోపు వేస్తోంటే ఎల్లావు ఎల్లమంద ముంజేతుల్ని నాకింది.

వెళ్ళిపోతున్న ఎల్లమందకేసి మోరచాచి చూసింది.

ఆ గోమాతచూపుల్లో ఎల్లమందకు తనపాలబుగ్గల పసిపాపడు బోసి నవ్వుల్ని వెదజల్లుతూ కన్పించాడు.

అప్పటికింకా ఆసామి రంగయ్య నిద్రలేవలేదు.

3-4-1970 పొలికేక సచిత్ర వారపత్రికనుంచి